క్లుప్తంగా

ఆర్థిక సాయం

ఆత్మకూరు: ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు ఆనం కైవల్యా రెడ్డి, ఆత్మకూరు బీఎస్సార్ ఆస్పత్రి డాక్టర్ షకీల గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లికి చెందిన ఈటెల రాజమ్మ అనారోగ్యంతో రెండ్రోజుల క్రితం ఆత్మకూరులోని బీఎస్సార్ ఆస్పత్రికి రాగా వైద్యులు పరీక్షించి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఆమె ఆర్థిక పరిస్థితిని కోటేశ్వరి, వంటేరు మల్లికార్జున ద్వారా తెలుసుకున్న ఆనం కైవల్యా రెడ్డి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఆపరేషన్ అదనపు ఖర్చుల నిమిత్తం డాక్టర్ షకీల సాయం అందజేశారు. దీంతో ఇరువురు దాతలకు రాజమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

ఆధార్ క్యాంపు

అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూరు గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



అల్లూరు: నార్త్‌మోపూరు బీసీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు కేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ కందల రాజారెడ్డి, ప్రముఖ జ్యోతిష్యులు కనుమెళ్ల అశోక్ వితరణ చేసిన పుస్తకాలు, పెన్నులు, తదితర సామగ్రిని ట్రస్ట్ సభ్యులు కమల్‌సింగ్, జోసెఫ్, ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్ మల్లిసింగ్ విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయిని శైలజ పాల్గొన్నారు.

సన్మానం



ఆత్మకూరు: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ఆత్మకూరుకు చెందిన విశ్రాంత సైనికుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నెల్లూరులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌లో డొల్లతనం



ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో డొల్లతనం కనబడుతోందని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, సామాన్య ప్రజలకు ఒనగూరేదేమీ లేదని విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించి అమరావతి అభివృద్ధికి నిధులు గ్రాంటు రూపంలో ఇవ్వకుండా అప్పుగా ఇస్తున్నట్లు ప్రకటించి మొండిచేయి చూపడం దురదృష్టకరమన్నారు. పార్టీ నాయకులు డేవిడ్‌రాజు, సందానీ, వాగాల శ్రీహరి, లక్ష్మీపతి, లక్కు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేసి గుర్తించిన అవకతవకలపై విచారణ జరపనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

సా..గని ఖరీఫ్



కావలి: కావలి నియోజకవర్గంలో వర్షాధారితంగా వరి పంట సాగుచేస్తారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవకపోవడం, సోమశిల లోనూ నీరు లేకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. కావలి, కావలి రూరల్, దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాల్లో సుమారు 50వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లో, కాలువల్లో చుక్కనీరు లేని పరిస్థితి. సోమశిల ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు లేకపోవడంతో రైతులు ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నారు. కనీసం నారుమళ్లు పోసుకోవడానికి కూడా చుక్కనీరు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధత కనబరచలేదు. దీంతో పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

విద్యార్థులకు వసతి కష్టాలు

శిథిలావస్థకు చేరిన వసతి గృహం

- శ్లాబ్ దెబ్బతిని ఊడిపడుతున్న పెచ్చులు
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు
- వర్షం పడితే పాఠశాలలోనే పడక



శిథిలావస్థకు చేరిన రేవూరులోని ప్రభుత్వ బాలుర వసతిగృహం

సోమశిల: మండలంలోని రేవూరు ప్రభుత్వ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. పిల్లర్లతో పాటు శ్లాబు దెబ్బతిని పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడితే మొత్తం ఉరుస్తోంది. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

వర్షం పడితే పాఠశాలే దిక్కు

రేవూరులో ఉన్నత పాఠశాల ఉంది. దానికి అనుబంధంగా సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వసతిగృహాన్ని నిర్మించారు. రేవూరు ఉన్నత పాఠశాలకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. నిత్యం రాకపోకలు సాగించలేని విద్యార్థులు వసతిగృహంలో ఉండి విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తుంటారు. అయితే వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు సైతం దెబ్బతిని కమ్ములు బయటపడ్డాయి. శ్లాబు పెచ్చులూడి పడుతోంది. కిటికీ, తలుపులు కూడా చెదలు పట్టిపోయి పనికిరాకుండా పోయాయి. దీంతో ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వర్షం పడితే మొత్తం ఉరుస్తుండడంతో పాఠశాలలోనే విద్యార్థులు బస చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గతంలో వసతిగృహంలో 150 మందికిపైగా విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 60కు చేరుకుంది. వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడం..సౌకర్యాల లేమి కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. గతంలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వసతిగృహాన్ని సందర్శించి జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం సమస్యను తీసుకెళ్లారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై విద్యార్థులు మళ్లీ పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ తరుణంలో ప్రత్యామ్నాయ భవనంలో వసతిగృహాన్ని ఏర్పాటు చేసి వసతులు కల్పించడంతో పాటు శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో కొత్తభవనాన్ని నిర్మించాలని చాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి వసతిగృహ సమస్య

రేవూరు వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించడంతో పిల్లర్లు దెబ్బతిని కమ్ములు బయటపడ్డాయి. శ్లాబు సైతం పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వర్షం పడితే మొత్తం ఉరుస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహ దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరాం.

– కే నిరంజన్, వసతిగృహ వార్డెన్, రేవూరు



వరండాలో దెబ్బతిన్న శ్లాబు



శ్లాబు పెచ్చులూడి బయటపడిన కమ్ములు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అభిరామ్ ఆస్పత్రిలో స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన డాక్టర్లు

ఆత్మకూరు: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలు అధికారి డాక్టర్ ఎస్వీ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో లింగ నిర్ధారణపై డివిజనల్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచనల మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ సుధీర్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గర్భస్థ శిశువుల ఆరోగ్య పరిరక్షణ, అవయవ లోపాల గుర్తింపు కోసం మాత్రమే స్కానింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ చేయడం తీవ్ర నేరమన్నారు. లింగ నిర్ధారణతో భ్రూణ హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. బాలికలను సంరక్షించాలని, వారిని గర్భస్థంలోనే చిదిమివేయడం బాధాకరమన్నారు. దీనిని అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం రూపొందించాయని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ చేసి పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. డీఈఎంఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ లింగ వివక్ష తగదని, ఆడ, మగ పిల్లలు ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని అభిరామ్ ఆస్పత్రితో పాటు స్కానింగ్ కేంద్రాలను ఎస్వీ సుధీర్‌కుమార్ తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంఓ ఉషాసుందరి, జే వెంకయ్య, ఎం రత్నమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, ఎస్‌జీఓలు పాల్గొన్నారు.

గురుకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ, స్టాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జే పుష్పరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 డీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం తెలుగు, గణితం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంపీటీసీకి మాతృ వియోగం

ఉదయగిరి: పట్టణంలోని బిట్ వన్ ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి తల్లి నరసమ్మ(80)గురువారం వేకువన మతి చెందారు. ఆమె మృతదేహాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కాగా ఆమె మృతిపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజారెడ్డి సంతాపాన్ని ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మర్రిపాడు: మండలంలోని కోనసముద్రం గ్రామానికి చెందిన కంచర్ల మధు గురువారం రాత్రి డీసీపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తూ టోల్‌ప్లాజ్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడ్ని టోల్‌ప్లాజా సిబ్బంది ఆత్మకూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 మినీగోకులం యూనిట్ల మంజూరు

వరికుంటపాడు: మండలానికి 25 మినీగోకులం యూనిట్లు మంజూరైనట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ గురువారం తెలిపారు. ప్రభుత్వం పశువుల శాలలు నిర్మించుకునే పాడి రైతులకు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. రెండు పశువుల యూనిట్ విలువ రూ.1.03,500 కాగా, రైతు వాటాగా రూ.11,500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నాలుగు పశువుల యూనిట్ రూ.1,66,500 కాగా, రైతువాటాగా రూ.18,500, ఆరు పశువుల యూనిట్ రూ.2.07 లక్షలు కాగా, రైతు వాటాగా రూ.23వేలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అర్హులైన పాడి రైతులు పశువైద్యశాల లేదా రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు

పంటల సాగుపై రైతులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వాతావరణ ఆధారిత పంటల సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న పెనుమార్పులు, అందుకనుగుణంగా పంట రకాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. ఆముదం ఐసీహెచ్–5 హైబ్రీడ్ రకం, కంది, సజ్జ పంటల సాగుతో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. మెట్టప్రాంత భూముల్లో తేమ కీలకమైనందున వర్షపునీటి నిల్వకు పలుగు అడ్డంగా దున్నడం, విత్తడం, సబ్‌సాయిలర్ పరికరంతో తేమను నిల్వచేసుకోవచ్చన్నారు. కందిలో అంతరపంటలుగా జనుములు, ఉలవ, పెసర, అలసంద వంటి వంటిని సాగుచేసుకుని స్వల్ప వర్షం వలన కలిగే దుష్ఫలితాలు నివారించుకోవచ్చన్నారు. డీపీడీ శివన్నారాయణ, ఏఓ చెన్నారెడ్డి, మర్రిపాడు ఏఓ రామ్మోహన్, అయ్యవారిపల్లి, పోలంగారిపల్లి సర్పంచ్‌లు దుర్గయ్య, వెంకటసుబ్బయ్య, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలి

సీతారామపురం: గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి వందరోజుల ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి గ్రామంలో కూలీలకు విధిగా పనులు కల్పించాలన్నారు. కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయించాలన్నారు. ఏపీఓ సుభాషిణి, ఈసీ సువార్తయ్య, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఉదయగిరి: స్థానిక బాలాజీనగర్‌లో నిల్వ ఉన్న నీటిలో దోమల నివారణకు గంబూసియా చేపలను వైద్యాధికారిణి ఎం శివకల్పన గురువారం వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ నిల్వనీటిలో ఉండే దోమల లార్వాను గంబూసియా చేపలు ఆహారంగా తీసుకుంటాయని, తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. ప్రస్తుత సీజన్‌లో దోమలతో డెంగీ, మలేరియా, ఫైలేరియా, తదితర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావంతో మాదిగల్లో ఐక్యత



దుత్తలూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావంతో మాదిగల్లో ఐక్యత వచ్చిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా మండలంలోని తెడ్డుపాడు ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ జెండాను గురువారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ ఏర్పాటుతో మాదిగల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతు పింఛన్ల పెంపు కోసం పోరాటం చేసిన ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కుతుందన్నారు. ఎంఎస్‌పీ మండలాధ్యక్షుడు బర్రె అర్జున్, మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి, వీహెచ్‌పీఎస్ మండల కన్వీనర్ చందులూరి శాంసన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సోమశిల: అనంతసాగరంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో నాలుగురోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. చివరిరోజు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దుత్తలూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వెంగమాంబకు నెల పొంగళ్లు



విశేషాలంకరణలో వెంగమాంబ దంపతులు



పొంగళ్లు పెడుతున్న భక్తులు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలో నెల పొంగళ్ల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి కల్యాణం జరిగిన నాటి నుంచి 30వ రోజున నెల పొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా వెంగమాంబ, గురవయ్యానాయుడు దంపతుల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి



కావలి: వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కావలి: పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలల్లోని సమస్యలు, జీఓ నంబర్ 117 రద్దుపై యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు కావలి మండల నాయకులు ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓలకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రూరల్ అధ్యక్షుడు షేక్ ముజీబ్ అహ్మద్ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచి రెండు నెలలు కావస్తోందన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌లతో పాటు విద్యాయేతర పనులను అప్పగించడం వల్ల బోధనకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇబ్బందికరంగా ఉన్న జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. యూటీఎఫ్ నాయకులు వేణుగోపాల్, ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని, జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలని మండల యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ జ్యోతికి గురువారం వినతిపత్రం అందజేశారు.

‘టీచ్ టూల్’తో బోధనా నైపుణ్యాలు మెరుగు



సూచనలు చేస్తున్న ఏపీసీ ఉషారాణి

ఆత్మకూరు: ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు టీచ్ టూల్ యాప్ ఎంతో దోహదపడుతుందని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి అన్నారు. పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలలో టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఎంలతో పాటు ఎంపిక చేసిన ఉపాధ్యాయులు టీచ్ టూల్‌పై సమగ్ర అవగాహన పెంచుకోవాలన్నారు. అంతరం కేటాయించిన పాఠశాలలోని ఉపాధ్యాయుల పనితీరును యాప్ ద్వారా పరిశీలించి బోధనా నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మెరుగై విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ డిప్యూటీ డీఈఓ గోపాల్, ఎంఈఓ–2 చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్యశాల ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు కే వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ వైద్యులు, వైద్యసిబ్బంది సక్రమంగా సేవలందించడం లేదని ఆరోపించారు. ప్రతిరోజూ 200 మంది వరకు రోగులు వస్తున్నా వారికి సరైన వైద్యసేవలు అందడం లేదన్నారు. చిన్నపిల్లలు, గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, ఫిజీషియన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఉదయగిరిలో పనిచేస్తున్న వారిని డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపడాన్ని ఆక్షేపించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు.

ఘనంగా కల్చరల్ డే



మహిమలూరు మెయిన్ పాఠశాలలో కోలాట ప్రదర్శన



ఏటూరు పాఠశాలలో బుర్రకథ చెబుతున్న విద్యార్థులు



విద్యార్థిని నృత్య ప్రదర్శన

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్/చేజర్ల: శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్చరల్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పేరారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఆత్మకూరు మండలంలోని మహిమలూరు మెయిన్, బోయలచిరివెళ్ల, బట్టేపాడు, అరవేడు, బండారుపల్లి, తదితర పాఠశాలల్లో విద్యార్థులు కోలాట, పండరి భజనలు, పద్యనాటకాల ప్రదర్శనలతో అలరించారు. చేజర్ల మండలం ఆదూరుపల్లి ఉన్నత పాఠశాలలో భరత మాత్ర చిత్రాన్ని నేలపై రూపొందించి సంప్రదాయ దుస్తులను ప్రదర్శించారు. ఏటూరు ఎస్సీ కాలనీ పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధుల జీవితాలపై బుర్రకథను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్, హెచ్‌ఎంలు అనంతలక్ష్మి సోమవరపు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజారావు, రొట్టె వెంకటేశ్వర్లు, పీ ప్రసాద్, డీ మాల్యాద్రి, మధుసూదన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ప్రతినిధులకు సత్కారం



కావలి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ప్రతినిధులు డాక్టర్ కామంచి సుబ్బారావు, డాక్టర్ బెజవాడ రవికుమార్‌ను రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్‌యాదవ్ అమరావతిలో గురువారం సత్కరించారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 30న ముసునూరులోని ఐఎంఏ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 1,273 యూనిట్ల రక్తాన్ని సేకరించడంపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి ప్రత్యేక అభినందించారు. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

కావలి: విద్యార్థినులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ శారద అన్నారు. పట్టణంలోని విశ్వోదయ బాలికోన్నత పాఠశాలలో కావలి ఉమెన్ ఫోర్స్, జమాయతే ఇస్లామిక్ ఇ హింద్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయి లక్ష్మీమాధవి అధ్యక్షతన విద్యార్థులకు పలు అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ ఆడపిల్ల ఇంటికి మాత్రమే కాదని, యావత్ సమాజానికి వెలుగు అన్నారు. అమ్మాయిలు బాల్యదశ నుంచే నైతిక, సామాజిక, జీవిత విలువలను విద్యతో పాటు అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌ను సిలబస్‌లో భాగం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్స్ సభ్యులు నూర్జహన్, బుస్రా, సుమయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీమాధవి, మహాలక్ష్మి, రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ, స్నేహలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.